సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



జల్సాల కోసం చోరీలు

జల్సాలకు అలవాటు పడిన యువకులు చోరీల బాటపట్టారు. పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను మాయం చేస్తున్నారు. 8లో▸



పర్యావరణ పరిరక్షణకు కృషి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస రావు అన్నారు. 8లో▸



విగ్రహాలు ధ్వంసం

రానుమల్లగూడలోని రాముల వారి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాలను ధ్వంసం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

కలెక్టర్ శశాంక



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి అర్జీల విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని, వాటిని పెండింగ్‌లో పెట్టొద్దని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తమ గోడు చెప్పుకొనేందుకు జిల్లా నలుమూలల నుంచి బాధితులు చేరుకున్నారు. కలెక్టర్ స్వయంగా వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినతులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత, డీఆర్‌డీఓ శ్రీలత, డీపీఓ సురేష్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ డబ్బులు విడుదల చేయండి



సివిల్ సప్లై జాయింట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహేశ్వరం: రేషన్ షాపుల్లో లబ్ధిదారులకు ఉచిత బియ్యం పంపిణీ చేసిన కమీషన్ డబ్బులను వెంటనే విడుదల చేయాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం నగరంలో రాష్ట్ర సివిల్ సప్లై జాయింట్ కమిషనర్ ఎం.కే.రాథోడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. కమీషన్ డబ్బులు సకాలంలో రాక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్టు చెప్పారు. ఏ నెలకు సంబంధించిన కమీషన్ అదే నెలలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పులిమామిడి లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాను చందర్ గౌడ్, డీలర్లు చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణ, విజయ్ తదితరులు ఉన్నారు.



ఫాక్స్‌కాన్.. జిల్లాకు ఐకాన్

కొంగరకలాన్‌లో ఫాక్స్‌కాన్ సంస్థ కొత్త ప్లాంటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఐఫోన్లలో ఉపయోగించే చిప్స్‌ను ఇందులో తయారు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. రూ.కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న కంపెనీ అందుబాటులోకి వస్తే పెద్ద సంఖ్యలో యువతకు ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. జిల్లాకే ఈ సంస్థ తలమాణికం కానుంది.

అన్యాక్రాంతం.. దర్జాగా సొంతం!

జిల్లాలో ఆగని భూ దందా

- సర్కార్ భూములు యథేచ్ఛగా కబ్జా
- తాజాగా వెలుగులోకి శేరిగూడలోని 50 ఎకరాలు
- కొండకల్ బిలాదాఖలా భూములు పరులపాలు
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- కాపాడాలంటూ స్థానికుల ఆందోళనలు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న శేరిగూడ గ్రామస్తులు (ఫైల్)

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఘోరంగా విఫలమవుతోంది. రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ విభాగాల అధికారులు కబ్జాదారులతో కుమ్మక్కై, పరోక్షంగా వారికి సహకరిస్తున్నారు. కళ్లముందే రూ.కోట్ల విలువ చేసే భూమి అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో స్థానికులే ఆయా భూములను రక్షించుకునేందుకు రోడ్డెక్కాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.క్షేత్రస్థాయిలో ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం అటువైపు దృష్టిసారించక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఒకవైపు అంగుళం భూమి కూడాఅన్యాక్రాంతం కానీయొద్దని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరిస్తుంటే.. మరోవైపు కళ్లముందే ఖాళీ భూములు కబ్జా అవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం..పరోక్షంగా వారికి సహకరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మోకిల–కొండకల్ మధ్యలో..

శంకర్‌పల్లి మండలం మోకిల–కొండకల్ గ్రామాల మధ్య 76.26 ఎకరాల బిలాదాఖలా భూములు ఉన్నాయి. ఏళ్లుగా ఈ భూములను 45 మంది స్థానిక పేద రైతులు సాగు చేసుకుంటున్నారు. ఏ అడ్రస్, సర్వే నంబర్ లేని ఈ భూములకు 555 సర్వే నంబర్ నమోదు చేశారు. కోకాపేటకు అతి సమీపంలో ఉన్న ఈ భూములపై కొంత మంది పెద్దల కన్ను పడింది. ఎకరం రూ.15 కోట్లకుపైగా విలువ చేసే భూములను రైతుల నుంచి చాలా తక్కువ ధరకు కొనేశారు. వీటిలో ఇప్పటికే 27 ఎకరాలకుపైగా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి.

రెండు జిల్లాల సరిహద్దులోని భూములు..

తాజాగా జిల్లా సరిహద్దులోని శేరిగూడ గ్రామ కంఠం భూములపై సైతం పెద్దల కన్ను పడింది. ఇక్కడ 50 ఎకరాలకుపైగా (నద్దినాలా) ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో 8 ఎకరాలు శ్మశాన వాటిక, రెండు ఎకరాలు పల్లె ప్రకృతి వనం, మరో పది ఎకరాలు గుడి అధీనంలో ఉన్నాయి. మిగిలిన భూమిలో కొంత భాగాన్ని స్థానిక రైతులు సాగు చేసుకుంటున్నారు. రెండు జిల్లాల సరిహద్దుల్లో ఈ భూములు విస్తరించి ఉండటం, సర్వే నంబర్ కూడా లేకపోవడం ఆక్రమణదారులకు కలిసి వచ్చింది. శేరిగూడలోని ఇద్దరు కొండకల్‌లోని ఓ రియల్టర్ సహకారంతో ఈ భూములకు బై నంబర్ సృష్టించి గుట్టుగా విక్రయించేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటికే భారీ మొత్తం చేతులు మారినట్లు సమాచారం. ఈ భూములను కాపాడాలని ఆ గ్రామస్తులు ఇటీవల శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.

చెప్పుల దండ.. ఊరిలో ఊరేగింపు

- మద్యం విక్రేతలకు హెచ్చరిక
- కిషనగర్‌లో స్వచ్ఛందంగా మద్యపాన నిషేధం
- అమ్మినవారికి, కొన్నవారికి జరిమానా
- పట్టించినవారికి పారితోషికం
- ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన గ్రామస్తులు



కిషన్‌నగర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: మద్యం పచ్చని పల్లెలు, కాపురాల్లో చిచ్చుపెడుతోంది. సంసారాలను గుల్ల చేస్తోంది. ఎంత నచ్చజెప్పినా మందుబాబులు దురలవాటును మానడం లేదు. ఈ క్రమంలో షాద్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామస్తులు మద్యం మహమ్మారిపై స్వచ్ఛందంగా సమరం ప్రకటించారు. బెల్టు దుకాణాలు మూసి వేయాలని, మద్యపానం నిషేధించాలని ఇటీవల గ్రామానికి చెందిన శేఖర్ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహారదీక్ష చేపట్టాడు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్ బెల్టు దుకాణా దారులకు నోటీసులు జారీ చేశారు. ఎలాగైనా మద్యాన్ని తమ గ్రామ దరిదాపుల్లోకి రానీయొద్దంటూ గ్రామస్తులంతా ఏకమయ్యారు. తాజాగా గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు మరో అడుగు ముందుకేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ''గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.50వేల జరిమానాతో పాటు చెప్పుల దండ మెడలో వేసి గ్రామ పెద్దల సమక్షంలో ఊరిలో ఊరేగింపు చేస్తామని.. మద్యం కొనుగోలు చేసిన వారికి రూ.25వేలు జరిమానా విధిస్తామని.. విక్రయిస్తున్న వారిని పట్టిస్తే రూ.10వేలు నజరానా ఇస్తాం'' అంటూ అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఇవి అందరినీ ఆకర్షించడంతోపాటు చర్చనీయాంశంగా మారాయి.

గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని కలెక్టర్ శశాంక అన్నారు. ప్రభుత్వ ఆదేశాను సారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పరిస్థితులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనారోగ్యానికి గురికాకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించి మెడికల్ కిట్లు, ట్యాబ్లెట్లు, నిర్వహణ విధానాలను అడిగి తెలుసుకున్నారు. భోజనశాల, వంటశాలను పరిశీలించి అక్కడే వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం డార్మెంటరీలో కలెక్టర్ బస చేశారు. సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, మల్టీజోన్ జోన్ 2 ఆఫీసర్ రజని, ప్రిన్సిపాల్ ఎం.విరూధిని, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట్ పాల్గొన్నారు.

ఉదయం 6.30కే బాపూఘాట్‌కు గవర్నర్

లంగర్‌హౌస్: గాంధీ జయంతి రోజున బుధవారం ఉదయం 6.30 గంటలకే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌కు విచ్చేస్తారని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం బాపూఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మహాత్ముడికి గవర్నర్ మొదట నివాళులర్పిస్తారని, అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఉదయం 10.30 గంటలకు బాపూఘాట్‌కు వస్తారని తెలిపారు. కాగా బాపూఘాట్ వద్ద ఏర్పాట్లు, పనులు సరిగా చేయని సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



చేవెళ్ల: ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థినుల సందడి

పూల వేడుక.. షురూ ఇక

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు జిల్లాలో షురూ అయ్యాయి. పలు పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలను ఒకచోట చేర్చి విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు పాడుతూ.. ఆడుతూ సందడి చేశారు. చివరగా వాటిని సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.



ఆమనగల్లు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

‘ఫార్మా’లో నకి‘లీలలు’!

- అనర్హులకు పరిహారంతోపాటు హెచ్‌ఎండీఏ మెగా వెంచర్‌లో ఇళ్ల స్థలాల సర్టిఫికెట్ల పంపిణీ
- సర్కార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ అధికారులు
- 300 మందికి పైగా అనర్హులు ఉన్నట్లు గుర్తింపు
- వీరిలో చాలా మంది స్థానికేతరులే..
- రూ.వెయ్యి కోట్ల విలువ చేసే కుంభకోణం జరిగినట్లు అనుమానం
- నకిలీల ఏరివేతకు రంగం సిద్ధం



మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ మెగా వెంచర్‌లో వేసిన రోడ్డు

యాచారం: ఫార్మా సర్టిఫికెట్లలో నకిలీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భూసేకరణలో అప్పటి అధికారుల అండదండలతోనే నకిలీలు పరిహారం పొంది, ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు అందుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తీగ లాగితే డొంగ కదిలినట్లు ఫార్మాసిటీ భూసేకరణలో పరిహారం పొందిన అనర్హుల గురించి ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు ఆరా తీస్తే పెద్ద కుంభకోణమే వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సేకరణలో భాగంగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో దాదాపు 5 వేల మందికి పైగా రైతులకు చెందిన 7,640 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూమిని అధికారులు సేకరించారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో ఫార్మాసిటీ వ్యతిరేకతను తగ్గించడానికి ప్లాట్ల గాలాన్ని అస్త్రంగా ఉపయోగించారు. ఫార్మాసిటీకి భూములిచ్చిన రైతులకు ప్లాట్లు ఇచ్చేందుకు అప్పటి సర్కార్ నిర్ణయించి మీరాఖాన్‌పేట సమీపంలోని 600 ఎకరాలకు పైగా భూమిలో హెచ్‌ఎండీఏ మెగా వెంచర్‌ను ఏర్పాటు చేసింది. భూములిచ్చిన రైతులకు ఎకరాకు 121 గజాల చొప్పున సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. వెంచర్‌లో రోడ్లు, డ్రైనేజీ, క్రీడా మైదానం, పాఠశాల, దేవాలయాలు నిర్మించేలా నిర్ణయించారు. ఫార్మా ప్లాట్లు క్రయ, విక్రయాలు చేసుకునే విధంగా అప్పటి సర్కార్ నిర్ణయించింది. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ వెంచర్‌లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కొద్ది రోజుల క్రితమే జిల్లా కలెక్టర్ శశాంక మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌ను సందర్శించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

తీగ లాగితే డొంక కదిలినట్లు ..

ఫార్మాసిటీ భూసేకరణలో రూ.కోట్లాదిగా పరిహారం పొందిన అనర్హులను గుర్తించడంపై కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టింది. సర్కార్‌లోని కీలక నేత ఒకరు అనర్హులకు పరిహారం అందిన విషయమై నిగ్గు తేల్చాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సీఎం ఆదేశాల మేరకు పరిహారం అందుకున్న అనర్హుల జాబితాను సేకరించే పనిలో రాష్ట్ర ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు నిమగ్నమయ్యారు. తీగ లాగితే దొంక కదిలినట్లు ఓ భూసేకరణ అధికారి అండదండలతోనే 2020 నుంచి 2023 వరకు నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో వందలాది ఎకరాలకు సంబంధించి అనర్హులు రూ.కోట్లలో పరిహారం పొందినట్లు గుర్తించారు. పరిహారంతోపాటు మళ్లీ మీరాఖాన్‌పేటలోని మెగా హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ప్లాట్లు కూడా పొందినట్లు తేల్చారు. అనర్హులకు ఫార్మా ప్లాట్లు పంపిణీ చేసింది కూడా ఆ భూసేకరణ అధికారి హయాంలోనేనని గుర్తించి సర్కార్ పెద్దలకు నివేదిక అందజేసినట్లు తెలిసింది. తాడిపర్తి గ్రామంలోని సర్వేనంబర్ 104లోని 250 ఎకరాల భూదాన్ (ఎడ్లకంచె) భూమిలో 168 ఎకరాలకు సంబంధించి వంద మందికి పైగా స్థానికేతరులకు పరిహారం ఇచ్చారు. వారికే మళ్లీ ఫార్మా ప్లాట్లు పంపిణీ చేయడానికి అప్పటి అధికారులు సిద్ధం కాగా తాడిపర్తి గ్రామస్తులు అడ్డుకున్నారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల్లో వందలాది మంది అనర్హులు సర్టిఫికెట్లు పొందినట్లు సమాచారం.

నంబర్లు, హద్దులు మరింత ఆలస్యం

మీరాఖాన్‌పేట మెగా వెంచర్‌లో ప్లాట్లు పొందిన రైతులకు సర్టిఫికెట్లపై నంబర్లు, హద్దులు రాయడం మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఫార్మాసిటీకి ఏఏ గ్రామాల్లో భూసేకరణ చేశారు. ఏ గ్రామంలో ఏఏ సర్వే నంబర్లలో ఎన్ని ఎకరాలు అసైన్డ్ చేశారు. అసైన్డ్ కమిటీలో పేర్లున్న వారు ఎంత మంది.. కబ్జాదారులెంత మంది.. నిజమైన రైతులకు పరిహారం అందిందా.. అవార్డులో ప్రచురించిన రైతుల పేర్లు తదితర వివరాల రికార్డులను కొద్ది రోజుల క్రితం రాష్ట్ర ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు యాచారం తహసీల్దార్ కార్యాలయం నుంచి సేకరించి తీసుకెళ్లారు. అనర్హులు ఫార్మా సిటీలో పరిహారం పొందడమే కాక రూ.కోట్ల విలువ జేసే ప్లాట్లు పొందారని గుర్తించారు. ఆయా గ్రామాల్లో నకిలీలను ఎరివేసిన తర్వాతే నిజమైన రైతుల ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లకు నంబర్లు, హద్దులు నమోదు చేయాలని నిర్ణయించారు. హెచ్‌ఎండీఏ వెంచర్‌లో ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లపై నంబర్లు, హద్దులు రాసి పోజిషన్ ఇవ్వడం మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు ఓ ఉన్నతాధికారి ‘సాక్షి’కి తెలిపారు.



యాచారంలో ఫార్మా ప్లాట్ల సర్టిఫికెట్లు తీసుకోవడానికి ఎగబడుతున్న రైతులు (ఫైల్)

రూ. వెయ్యి కోట్లకు పైగా..

ఫార్మా ప్లాట్ల పంపిణీ కుంభకోణంలో దాదాపు రూ.వెయ్యి కోట్లకు పైగా కుంభకోణం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆయా గ్రామాల్లో 300 మందికి పైగా నకిలీలు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ మెగా వెంచర్ సమీపంలోని బేగరికంచెలో ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. ఫ్యూచర్‌సిటీ ఏర్పాటుకు వివిధ రకాల సంస్థలకు 13 వేల ఎకరాల భూమి (ఫార్మాసిటీకి సేకరించి) కేటాయించారు. భూములు కోల్పోయిన రైతులకు 121 గజాలు, 242 గజాలు, 363 గజాల చొప్పున ప్లాట్ల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. గతంలో చాలా మంది రైతులు 121 గజాల ప్లాటును రూ. 4 లక్షల నుంచి రూ. 5 లక్షలకే అమ్ముకున్నారు. ప్రస్తుతం రూ.8లక్షల నుంచి రూ.10 లక్షలు డిమాండ్ ఏర్పడింది.

నకిలీల సర్టిఫికెట్లు రద్దు చేస్తాం



అనుర్హులు పరిహారం పొంది, సర్టిఫికెట్లు తీసుకున్నట్లు తెలితే వారి సర్టిఫికెట్లు రద్దు చేస్తాం. ప్రతి రైతుకు అందజేసిన సర్టిఫికెట్‌ను తిరిగి పరిశీలిస్తాం. సర్టిఫికెట్లు తీసుకున్నంత మాత్రాన అయిపోలేదు. వారికిచ్చిన సర్టిఫికెట్లపై నంబర్లు, హద్దులు రాసి, కబ్జా చూపించాల్సి ఉంటుంది. నిజమైన రైతులకే మీరాఖాన్‌పేటలోని మెగా వెంచర్‌లో అవకాశం కల్పిస్తాం. ఉన్నత స్థాయిలో భూసేకరణ అక్రమాలపై విచారణ జరుగుతున్నట్లు సమాచారం మాత్రమే ఉంది.

– అనంత్‌రెడ్డి,
ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

వెండి మకర తోరణాల బహూకరణ



ఆర్యవైశ్య సంఘం నాయకులకు తోరణాలు అందజేస్తున్న వెంకటేశ్ దంపతులు

షాద్‌నగర్: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయానికి వ్యాపారి ఆకుల వెంకటేశ్ దంపతులు రూ.9లక్షల విలువైన వెండి మకరతోరణాలు అందజేశారు. ఆకుల రాఘవేందర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వెంకటేశ్, అరుణ దంపతులు వారి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మకర తోరణాలను ఆర్యవైశ్య సంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు యాదగిరి, మురళి, వెంకటేశ్, వజ్రలింగం, గోపాలకృష్ణ, చంద్రశేఖర్, రామ్మోహన్, వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహాలు ధ్వంసం



దుండగులు ధ్వంసం చేసిన ఉత్సవ మూర్తుల విగ్రహాలు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని రాసుమల్లగూడలో శ్రీరాముల వారి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు విగ్రహాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన అర్చకుడు, గ్రామస్తులు ఆలయానికి వెళ్లి చూడగా శ్రీరాముడు, సీతమ్మ తల్లి, ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను ధ్వంసం చేసి గంటను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గ్రామస్తుడు రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వర్షాలకు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. 'పట్నం' నియోజకవర్గ పరిధిలోని తుర్కయంజాల్ మాసబ్ చెరువులో యువకులు ఇలా చేపల షికారు చేస్తూ కనిపించారు. - సాక్షి, ఫొటో గ్రాఫర్



కొంగరకలాన్‌లో కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో రోడ్డుపై గృహ నిర్మాణానికి వినియోగించే కంకర పేరుకు పోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. - సాక్షి, ఫొటో గ్రాఫర్

జల్సాల కోసం చోరీలు

ఐదుగురు నిందితులకు రిమాండ్

- రూ.9 లక్షల విలువైన 23 బైక్‌ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి



కేసు వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తదితరులు

యాచారం: జల్సాలకు అలవాటు పడిన యువకులు బైక్ చోరీల బాటపట్టారు. పగలు రెక్కీ నిర్వహించి, రాత్రిళ్లు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను మాయం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు చోరీ ముఠా ఆటకట్టించారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు వివరాలను యాచారం పోలీస్ స్టేషన్‌లో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి సోమవారం వెల్లడించారు. తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన దుబ్బ హర్షవర్ధన్ ఐటీఐ పూర్తి చేశాడు. జల్సాలకు అలవాటుపడిన యువకుడు సులువుగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో మహబూబ్‌నగర్, నగరంలోని అఫ్జల్‌గంజ్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, యాచారం, మంచాల, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణాల పరిధిలో పార్క్ చేసిన 23 బైక్‌లను చోరీ చేశాడు. వీటి విలువ సుమారు రూ.9 లక్షలు ఉంటుంది. హర్షవర్ధన్ చోరీ చేసిన బైక్‌లను నందివనపర్తి గ్రామానికి చెందిన ఎడ్ల రాజు, మహమ్మద్ అమీర్ అలీ, నక్కర్తమేడిపల్లికి చెందిన బేత జంగయ్య, జాల నాగరాజు సహకారంతో అమాయకులకు కట్టబెట్టేవారు. వచ్చిన డబ్బులతో ఐదుగురు కలిసి జల్సా చేస్తున్నారు. దొంగిలించిన వాటిలో కొన్నింటిని విక్రయించగా, మరికొన్ని వారి ఇళ్లల్లోనే దాచి ఉంచారు. ఈ విషయమై ఇటీవల ఓ వ్యక్తి హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు నేతృత్వంలో సీఐ నర్సింహారావు, ఎస్ఐ తేజంరెడ్డి.. ప్రధాన నిందితుడైన హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా చోరీ వివరాలను చెప్పాడు. హర్షవర్ధన్‌తో పాటు బైకుల విక్రయాల్లో సహకరించిన పైనలుగురిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించామన్నారు. రూ.9 లక్షల విలువైన 23 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు, చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సంఘటన జరిగినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

కేసులతో పాటు క్యాన్సిల్!

- జోరుగా 'కండల స్టెరాయిడ్స్' దందా
- జిమ్‌లకు సరఫరా చేస్తున్న పలు మెడికల్ షాపులు
- నగర వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ పోలీసుల నిఘా
- తాజాగా మందుల దుకాణం లైసెన్సు సైతం రద్దు

సాక్షి, సిటీబ్యూరో: లోబీపీ సమస్యతో బాధపడుతున్న వారిలో రక్తపోటు నియంత్రణతో పాటు వైద్య రంగంలో అత్యవసర సమయాల్లో వినియోగించే ఇంజెక్షన్లను స్టెరాయిడ్స్‌గా విక్రయిస్తున్న ముఠాలు నగరంలో పెరిగిపోయాయి. ఈ గ్యాంగ్‌లపై నిఘా ముమ్మరం చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను పట్టుకోవడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అయితే ఈ దందాను పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి మరిన్ని కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఇంజెక్షన్లను అక్రమ మార్గంలో విక్రయిస్తున్న వారి వివరాలను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నారు. ఈ విభాగం అవసరమైన నోటీసులు జారీ చేసి దుకాణాల లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తోంది. తాజాగా మలక్‌పేట జడ్జెస్ కాలనీలోని ఆదిల్ ఫార్మసీ అండ్ జనరల్ స్టోర్స్ లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మలక్‌పేటకు చెందిన మహ్మద్ ఆదిల్ ఈ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇండియా మార్ట్ యాప్ ద్వారా ఉత్తరాదికి చెందిన సరఫరాదారుల నుంచి మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు ఖరీదు చేస్తున్న అతను వాటిని జిమ్ నిర్వాహకులకు అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. వారు తమ జిమ్‌లకు వస్తున్న యువత నిర్ణీత బరువు కంటే ఎక్కువ వెయిట్స్ ఎత్తడానికి, ఎక్కువ సమయం వ్యాయామం చేయడానికి స్టెరాయిడ్‌గా వాడటానికి వీటికి విక్రయిస్తున్నారు. ఒక్కో ఇంజెక్షన్ రూ.2000 వరకు అమ్ముతున్నారు. ఆదిల్ వ్యవహారంపై సమాచారం అందుకున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జి.అనిల్‌రెడ్డితో కలిసి దుకాణంపై దాడి చేశారు. అతడి వద్ద నుంచి 30 మెఫెంటర్మైన్ సల్ఫేట్ ఇంజెక్షను స్వాధీనం చేసుకున్నారు. లోతుగా ఆరా తీసిన అధికారులు పక్షం రోజుల ముందే సదరు దుకాణంపై దాడి చేసిన అధికారులు 10 ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఆదిల్ ఫార్మసీ అండ్ జనరల్ స్టోర్‌కు డీసీఏ నోటీసులు జారీ చేసింది. యజమాని ఆదిల్ సమాధానంతో సంతృప్తి చెందని అధికారులు దుకాణం లైసెన్సులు శాశ్వతంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాంటి ఇంజెక్షన్లు, టాబ్లెట్స్‌ను స్టెరాయిడ్‌గా వాడటం వల్ల అనేక దుష్పరిణామాలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా దందాలకు పాల్పడుతున్న మందుల దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులకు సన్నాహాలు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు



ఎల్ఈడీ బల్బులు తయారు చేస్తున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. శంకర్‌పల్లి ఆదర్శ పాఠశాలలో సోమవారం నేషనల్ గ్రీన్ కాప్స్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ వర్క్ షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లాలోని 29పాఠశాలల నుంచి 90 మంది విద్యార్థులు, 30మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వర్క్ షాప్‌లో విద్యార్థులకు ఎల్ఈడీ బల్బు తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పరిమిత వనరులను అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలే తప్ప.. దుర్వినియోగం చేయొద్దని సూచించారు. విద్యార్థులు నిత్యం కొత్త విషయాలను కనుగొనేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, అసిస్టెంట్ రిసోర్స్ పర్సన్స్ రమేష్, సాయి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

ఆరు సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: శ్మశాన వాటికలో పేకాడుతున్న ఏడుగురిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ సత్యనారాయణ తెలిపిన ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన ఏడుగురు వ్యక్తులు స్థానిక పోచమ్మబస్తీ శ్మశాన వాటిక వద్ద ఆదివారం పేకాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.21,500 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

మధ్యంతర బెయిల్ కోసం జానీ మాస్టర్ పిటిషన్

రంగారెడ్డి కోర్టులు: లైంగికదాడి ఆరోపణల నేపథ్యంలో చంచల్‌గూడా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న నృత్య దర్శకుడు జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ కోరుతూ రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో, 9వ అదనపు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఢిల్లీలో జరగనున్న కార్యక్రమానికి తాను తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉన్నందున మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసాడు. ఈ పిటిషన్‌పై మంగళవారం ప్రాథమిక విచారణ జరగనుంది. కాగా జానీ మాస్టర్ దాఖలు చేసిన సాధారణ బెయిల్ పిటిషన్‌ను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

రైతుల సంక్షేమమే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య

మంచాల: రైతుల సంక్షేమమే లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని, అప్పుడే కొత్త వారికి ఇవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు. అర్హులందరికీ రుణ మాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెదిరె హన్మంత్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రంలోనూ ఇతర రాష్ట్రాల మాదిరిగా న్యూస్ పేపర్ డిస్ట్రిబ్యూటర్లకు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు వనమల సత్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం త్యాగరాజ గానసభ మందిరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిస్ట్రిబ్యూటర్ల సహకార పరపతి సంఘం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈనెల 15 జరగబోయే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడాలి రాంప్రసాద్ రావు, అశోక్ కుమార్, మధు, ప్రసాద్, శ్రీను రాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

మృత్యు వేగం

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మరొకరు డాక్టర్
- మాసాబ్‌ట్యాంక్ వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ పరిస్థితి విషమం
- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై మూడు కార్లు ధ్వంసం

అతి వేగం ఇద్దరు యువకుల ఉసురు తీసింది. వీరిలో ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కాగా, మరొకరు నేత్ర వైద్యుడు. మాసాబ్ ట్యాంక్ వద్ద జరిగిన ప్రమాదంలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. పీవీ ఎక్స్‌ప్రెస్ హైవే పై జరిగిన ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఈ మూడు ప్రమాదాలకూ అతి వేగమే కారణంగా పోలీసులు పేర్కొన్నారు..



మసాబ్‌ట్యాంక్ ఫ్లై ఓవర్‌పై నుజ్జునుజ్జయిన క్యాబ్

నాంపల్లి: అతివేగం ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రాణాన్ని బలితీసుకుంది. మరో ఐదుగురిని ఆస్పత్రి పాల్జేసింది. బైక్‌ను తప్పించబోయే క్రమంలో క్యాబ్ డ్రైవర్ ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టిన సంఘటన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో మాసాబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్ వద్ద సోమవారం ఉదయం చోటుచేసుకుంది. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. క్యాబ్ డ్రైవర్ సాయి వంశి సోమవారం ఉదయం హయత్‌నగర్‌లో సాయితేజ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను పికప్ చేసుకుని మార్గమధ్యలో సందీప్, మాధురి, సాయి కిషన్, సాయి సుధలను క్యాబ్‌లో ఎక్కించుకుని గచ్చిబౌలికి బయలుదేరాడు. మసాబ్‌ట్యాంక్ ఫ్లైఓవర్‌పై అతను బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పిన ఫ్లైఓవర్ గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో జెన్‌ప్యాక్ కంపెనీ ఉద్యోగి సాయితేజ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అత్తాపూర్‌లోని శ్రీకర్ ఆస్పత్రికి తరలించారు. వారిలో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్ఆర్‌పై కారు అదుపుతప్పి వైద్యుడి దుర్మరణం



చెట్ల పొదల్లో డాక్టర్ నిలేష్ రెడ్డి మృతదేహం

రాజేంద్రనగర్: వారం రోజుల్లో విదేశాలకు వెళ్లాల్సిన ఓ యువ వైద్యుడు రాజేంద్రనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-10లో ఉంటున్న డాక్టర్ నిలేశ్ రెడ్డి (29) ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాడు. ఏడాది క్రితమే అతడికి వివాహం జరిగింది. ఆదివారం రాత్రి తన స్నేహితులను కలిసేందుకు ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి అతడి భార్య ఫోన్ చేయగా శంషాబాద్‌లో స్నేహితుడిని డ్రాప్ చేసి వస్తానని చెప్పాడు. తెల్లవారుజామున శంషాబాద్ నుంచి వస్తున్న అతను ఔటర్ రింగ్ హిమాయత్‌సాగర్ ఎగ్జిట్ గేట్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన దిమ్మెలను ఢీకొంది. కారు డోర్ తెరుచుకోవడంతో నిలేశ్ రెడ్డి పక్కనే ఉన్న పొదల్లో పడిపోయాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పొదల్లో పడివున్న నిలేశ్‌ను తాళ్ల సహాయంతో పైకి తీశారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.



మూడు కార్లు ధ్వంసం..

రాజేంద్రనగర్: పీవీనరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వేపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు పిల్లర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం స్ట్రీట్ పోల్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న రోడ్డుపైకి దూసుకొచ్చింది. ఈ ఘటనలో కారులోని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కారు వేగానికి డివైడర్ దాటి మరో మూడు కార్లను ఢీకొట్టింది. దీంతో పీవీ ఎక్స్‌ప్రెస్ వేపై రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. కాగా ఘటనా స్థలానికి కొద్ది దూరంలో డివైడర్‌కు రంగులు వేస్తున్న కూలీలు తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. బాధితులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి
రంగారెడ్డి
బుధవారం । 2 । అక్టోబర్ । 2024



చేవెళ్ల: విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడుతున్న చేవెళ్ల బస్‌స్టేషన్



ఆమనగల్లు: బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



చేవెళ్ల: బస్సులోకి ఎక్కేందుకు ఎగబడుతున్న విద్యార్థులు, జనం

బడి నుంచి ఇంటిబాట

పాఠశాలలు, గురుకులాలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులంతా ఇంటిబాట పట్టారు. వివిధ గురుకుల పాఠశాలలు, హాస్టల్స్ నుంచి లగేజ్ సర్దుకుని స్వగ్రామం బయలుదేరేందుకు బస్‌స్టేషన్లకు చేరుకున్నారు. దీంతో విద్యార్థులు, వారిని తీసుకెళ్లేందుకు వచ్చిన తల్లిదండ్రులతో బస్టాండ్లు కిటకిటలాడాయి. సకాలంలో బస్సులు రాక గంటలతరబడి నిరీక్షిస్తూ కనిపించారు. ఒకటి రెండు బస్సులు రాగానే ఎక్కేందుకు ఎగబడ్డారు. కొంతమంది చేసేది లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

– చేవెళ్ల/ఆమనగల్లు



చేవెళ్ల: పిల్లలతో వేచి ఉన్న మహిళ



ఆమనగల్లు: బ్యాగులతో స్వగ్రామానికి వెళ్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

సరదాగా గడిపి.. సమస్యలపై ఆరా తీసి



గురుకుల విద్యార్థులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం: విద్యార్థులతో సరదాగా గడుపుతూ గురుకులంలోని సమస్యలపై కలెక్టర్ శశాంక ఆరా తీశారు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ సాంఘిక, సంక్షేమ గురుకుల బాలుర హాస్టల్‌లో సోమవారం రాత్రి ఆయన బస చేసిన సంగతి తెలిసిందే. మంగళవారం తెల్లవారుజామున విద్యార్థులతో మార్నింగ్ వాక్ చేసి, కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. రాత్రి బసలో విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి సమస్యలను గురుకుల సొసైటీ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బాపూఘాట్ ముస్తాబు



లంగర్‌హౌస్: గాంధీ జయంతి వేడుకలకు బాపూఘాట్ ముస్తాబైంది. బుధవారం గవర్నర్, ముఖ్యమంత్రితోపాటు పలువురు వీఐపీలు, ప్రజలు హాజరై మహాత్మా గాంధీకి నివాళులు అర్పించనున్నారు. ఉదయం 6.30 గంటలకు బాపూ సమాధి వద్ద గవర్నర్ జిష్ణు దేవ్, 10.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పగుచ్ఛాలు ఉంచి.. బాపూ ధ్యాన మందిరంలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. వీఐపీల పర్యటన నేపథ్యంలో డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్‌లు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

చికున్‌గున్యా నివారణకు స్పెషల్ డ్రైవ్

అధికారులకు ఆమ్రపాలి ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో చికున్ గున్యా కేసుల నివారణకు ఈ నెల 3వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. చికున్‌గున్యా కేసులు నమోదైన ఇళ్ల చుట్టుపక్కల 50 నుండి వంద 100 ఇళ్ల వరకు సర్వే చేసి దోమల ఉత్పత్తి జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ నీరు నిల్వ ఉన్నట్లయితే యాంటీ లార్వల్ ఆపరేషన్, ఫాగింగ్ చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో చికున్ గున్యా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. నీటి నిల్వలున్న తొట్లు, డ్రమ్ములు, కూలర్లలో నీటిని తొలగించి శుభ్రం చేయాలని, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు తొలగించాలని, చిన్న చిన్న నీటి గుంతలను పూడ్చాలని, నీటినిల్వలున్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, ఫ్రెష్ వాటర్‌లో గంబూషియా చేపలు వదలాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో చికెన్ గున్యాకు సంబంధించిన బాధితుల వివరాలు అడ్రస్‌తో సహా విధిగా నమోదు చేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిధిలో చికున్ గున్యాను నియంత్రించేలా ఎంటమాలజీ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

ఎంఎంటీఎస్ సర్వీసులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: సాంకేతిక కారణాల దృష్ట్యా బుధవారం (అక్టోబర్ 2వ తేదీ) పలు మార్గాల్లో ఎంఎంటీఎస్ సర్వీసులను రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉందానగర్-లింగంపల్లి మధ్య నడిచే ఆరు సర్వీసులను రద్దు చేయనున్నారు. అలాగే మరో రెండింటిని లింగంపల్లి నుంచి ఫలక్‌నుమా వరకు పరిమితం చేయనున్నారు.

ప్రయోజనం దక్కేనా?

ఆశలపల్లకిలో ‘ఫార్మా’ భూ బాధితులు

- గత ఏడాది హైకోర్టులో పిటిషన్ వేసిన వైనం
- ప్రభుత్వ పరంగా అన్ని పథకాలు వర్తించాలని విజ్ఞప్తి
- తాజాగా రైతులకు అనుకూలంగా ఉత్తర్వులు
- సయోధ్యకే సర్కార్ మొగ్గు!



కుర్మిద్దలో ఫార్మాసిటీకి ఇవ్వడానికి పట్టా రైతులు నిరాకరిస్తున్న భూములు

యాచారం: ప్రభుత్వం అందించే పథకాల కోసం ఫార్మా భూ బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. తాజాగా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అమలయ్యేనా అన్న చర్చ మొదలైంది. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అధికారులు టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూ రికార్డులను రైతుల పేర్ల మీద మార్చేందుకు అధికారులు సాహసిస్తారా అనేది చూడాలి. గతంలోనూ పలుమార్లు హైకోర్టు ఫార్మాసిటీ భూసేకరణలో రైతుల అంగీకారం లేకుండా అవార్డులు పాస్ చేసి, రాత్రికిరాత్రే రికార్డులు మార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేయడం తెలిసిందే. టీజీఐఐసీ పేరు మీద మార్చేసిన పట్టా భూముల రికార్డులను రైతుల పేర్ల మీద మార్చి, రైతుబంధు, బ్యాంకు రుణాలు, ఇతర ప్రయోజనాలు కలిగేలా కృషి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. అధికారులు మాత్రం రైతుల పేర్ల మీద భూ రికార్డులు మార్చకపోగా, కనీసం విరాసత్, మ్యుటేషన్లు, ప్లాట్లు బుక్ అయినా రిజిస్ట్రేషన్లు చేయలేదు. తాజాగా హైకోర్టు ఫార్మా రైతులకు అన్ని ప్రయోజనాలు కల్పించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఈ తీర్పునైనా గౌరవిస్తారా.. లేదంటే గతంలో మాదిరిగానే వ్యవహరిస్తారా అన్న సందిగ్ధం నెలకొంది. గత బీఆర్‌ఎస్ హయాంలోనే పట్టా రైతులు కోర్టుకెళ్లగా, తాజాగా కాంగ్రెస్ సర్కార్ సైతం పట్టా భూముల సేకరణకు ఆసక్తి చూపుతున్న దృష్ట్యా రైతుల్లో అయోమయం నెలకొంది.

అసలు సమస్య 2,211 ఎకరాలతోనే..

బీఆర్‌ఎస్ హయాంలో ఫార్మాసిటీకి యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల పట్టా, అసైన్డ్ భూములు సేకరించడానికి నిర్ణయించడం తెలిసిందే. ఇందులో భాగంగా యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 9,851 ఎకరాల పట్టా, అసైన్డ్ భూముల సేకరణకు అధికారులు నిర్ణయించారు. మొదట్లో రైతుల నుంచి అంతగా అభ్యంతరాలు రాలేదు. ఆయా గ్రామాల్లో ఏళ్ల క్రితం రూ.లక్ష నుంచి రూ.5 లక్షలలోపు భూములను కొనుగోలు చేసిన స్థానికేతరులు అధికారులు అడిగిన వెంటనే ఎకరాకు రూ.12.50 లక్షలు, ఆ తర్వాత రూ.16 లక్షల చొప్పున విక్రయించారు. స్థానికంగా ఉన్న రైతులు మాత్రం ఆ భూములపైనే ఏళ్లుగా ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. కుర్మిద్ద, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, తాడిపర్తి గ్రామాల్లో ఏడాదికి మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఫార్మాసిటీకి ఇవ్వడానికి ఆసక్తి చూపించలేదు. హైకోర్టును ఆశ్రయించి స్టేలు తెచ్చుకున్నారు. కోర్టులో కేసులున్నప్పటికీ అధికారులు మాత్రం నక్కర్తమేడిపల్లిలో 483.25 ఎకరాలు, నానక్‌నగర్‌లో 154.16 ఎకరాలు, తాడిపర్తిలో 382.33 ఎకరాలు, కుర్మిద్దలో 974.06 ఎకరాలతో పాటు, మరో 216 ఎకరాల పట్టా భూములకు సంబంధించి రాత్రికిరాత్రే నోటిఫికేషన్లు వేశారు. వాటికి అవార్డులు పాస్ చేసి, పరిహారం డబ్బులను అథారిటీలో జమ చేశారు. దీంతో మూడేళ్లుగా 2,211 ఎకరాల పట్టా భూముల సమస్య హైకోర్టులో ఉండింది.

కోర్టు ఉత్తర్వులను గౌరవించాలి



సర్వేనంబర్లు 52, 69,70లలో మా కుటుంబ సభ్యులకు 20 ఎకరాల పట్టా భూమి ఉంటుంది. ఫార్మాసిటీకి ఇవ్వడం లేదని అధికారులు రెండేళ్ల క్రితం భూ రికార్డులను టీజీఐఐసీ పేరుపై మార్చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సీసీఎల్‌ఏ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. రెండేళ్లుగా రైతుబంధు, బ్యాంకు రుణాలు అందక నష్టపోయాం. ఇప్పటికైనా అధికారులు హైకోర్టు ఉత్తర్వులను గౌరవించాలి. టీజీఐఐసీ పేరు తీసేసి రికార్డుల్లో మా పేర్లు నమోదు చేయాలి.

– మర్రి భగవంత్‌రెడ్డి, రైతు, నానక్‌నగర్

కాంగ్రెస్ సర్కార్ సానుకూలం

రైతులతో సయోధ్య కుదుర్చుకునేందుకే రేవంత్ రెడ్డి సర్కార్ మొగ్గ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో కొన్ని ఎకరాల్లోనే ఫార్మా పరిశోధన సంస్థలకు కేటాయించి మిగతా ఎకరాల్లో ఫ్యూచర్‌సిటీ నిర్మాణానికి దృష్టి సారించింది. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌లోని కీలక నేతతో సమాలోచనలు చేశారు. పట్టా భూములకు (గతంలో ఎకరాకు రూ.16 లక్షలు) ఎకరాకు రూ.24 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు పరిహారం, రైతుల కుటుంబాల్లో ఉన్నత చదువులు చదివిన యువకులకు కలెక్టర్ కార్యాలయ సమీపంలోని ఫాక్స్‌కాన్, కెన్స్ సంస్థల్లో ఉద్యోగాల కల్పన, మీరాఖాన్‌పేటలోని హెచ్‌ఎండీఏ వెంచర్‌లో 121 గజాల చొప్పున ప్లాట్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు నిర్మించుకోవడానికి రూ.5 లక్షల చొప్పున ఇచ్చేందుకు నిర్ణయించినట్లు సమాచారం. అంతేకాదు పట్టా భూముల రికార్డులను ఎప్పటి నుంచి టీజీఐఐసీ పేరు మీద మార్చారో అప్పటి నుంచి రైతులు కోల్పోయిన రైతుబంధు, బ్యాంకు రుణాలు, రైతుబీమా తదితర ప్రయోజనాలు కల్పించేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. సర్కార్ ఆదేశాల మేరకు అధికారులు ఆయా గ్రామాల్లోని పట్టా రైతులతో సంప్రదింపులు చేస్తున్నారు. కొందరు ఆసక్తి చూపిస్తున్నప్పటికీ మిగతా వారు అడ్డుకుంటారనే భయం వారిని వెంటాడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యూచర్‌సిటీపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్న దృష్ట్యా పట్టా రైతులతో సమస్య రాకుండా అధికార యంత్రాంగం సయోధ్య దిశగా వేగం పెంచినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డిని సంప్రదించగా కొందరు పట్టా రైతులు సయోధ్యకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు.

దృష్టిని మళ్లించేందుకే హైడ్రా

- పేదల ఇళ్లను కూల్చడం సరికాదు
- బీజేపీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదని.. రాష్ట్రంలో సీయం రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలన కొనసాగిస్తున్నారని బీజేపీ సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదుపై ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను హడలెత్తిస్తోందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హైడ్రాను ఏర్పాటు చేసిందని విమర్శించారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. గతంలో ప్రజలు బీఆర్‌ఎస్‌కు అవకాశం ఇస్తే కుటుంబ, అవినీతి రాజకీయాలు చేసి అప్పుల రాష్ట్రంగా మిగిల్చిందని అన్నారు. మార్పు కోసం కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినా మార్పు లేదన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం దేశాభివృద్ధి, రక్షణ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 లక్షల మంది బీజేపీ సభ్యత్వాలు తీసుకున్నారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత్వాలు చేపట్టాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాధవి, జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కొండయ్య, పద్మజారెడ్డి, మనోహర్‌రెడ్డి, కక్కునూరి వెంకటేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అభయ్‌పాటిల్

‘నిథమ్’లో కూల్చివేతలు



ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణం తొలగింపు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో మంగళవారం కూల్చివేతలు చేపట్టారు. నిథమ్‌లో పురాతన రామమ్మ కుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో తరగతి గదుల కోసం భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ అంశం హైకోర్టుకు వెళ్లడంతో.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాన్ని తొలగించాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పర్యాటక శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న ‘నిథమ్’ హైకోర్టు ఆదేశాన్ని పాటించి ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాన్ని కూల్చివేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కూల్చివేతలకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న కట్టడాన్ని తొలగించారు.

కడ్తాల్‌లో..





చేవెళ్ల: ఓ ప్రైవేటు పాఠశాలలో బతుకమ్మ సంబరాలు



ఆమనగల్లు: ఓ ప్రైవేటు పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

పుష్పశోభితం.. విద్యార్థుల పరవశం

బుధవారం నుంచి దసరా సెలవులు కావడంతో మంగళవారం చివరి రోజు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చారు. బతుకమ్మ ఆటపాటలు.. కోలాటాలతో హోరెత్తించారు. మహిళా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సందడి చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



శంకర్‌పల్లి: బతుకమ్మలతో ఆదర్శ పాఠశాల సిబ్బంది



షాద్‌నగర్‌రూరల్: బతుకమ్మతో విద్యార్థినులు